

7 నగరంలో **జడివాన**

● చలితో వణికిపోయిన ప్రజలు

వానలో వాహనదారుల ఇబ్బందులు



బుట్టలు అల్లుతున్న కొరగలు

ఎన్నాళ్లీ వెదురుచూపు..!

- వెదురు అల్లికలతో జీవనం సాగిస్తున్న కొరగలు
- రెండు జిల్లాల్లో ఆదివాసీలుగానే గుర్తింపు
- అమలుకాని పీర్ కమిటీ సిఫారసులు
- ప్రత్యేక వసతులపై దృష్టి సారించని పాలకులు
- కేరళ తరహాలో అభివృద్ధికి పలువురి డిమాండ్
- బూజు పట్టిన మూడు దశాబ్దాల కిందటి నివేదిక

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆదివాసీల తెగల్లో ఇటీవల అభివృద్ధి కనిపిస్తోంది. కానీ రాష్ట్రంలోని కొరగలు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. వెదురుతో అద్భుతమైన బుట్టలు, కళాకృతులు అల్లే వీరు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని సముద్రతీర జిల్లాలు దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలో ఒకప్పుడు కర్ణాటకలో భాగమైన కాసరగోడు జిల్లాలో అత్యంత ప్రాచీనమైన బుడకట్టు సామాజిక వర్గం 'కొరగ (ఆదివాసీ)లు నివసిస్తున్నారు. పంటలు పండించుకుంటేనే కొరగల కడుపు నిండుతుంది. వీరి కోసమే ఉడుపి జిల్లా కుందాపుర తాలూకా హాళాడి గ్రామానికి కిలోమీటరు దూరంలో బత్తగుళి వద్ద ఓ మోడల్ కాలనీని నిర్మించారు. మంగళూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మహ్మద్‌పీర్ నేతృత్వంలో 1990 దశకంలో సుదీర్ఘకాలంపాటు ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల్లో అటవీప్రాంతంలో నివసించే కొరగల జీవనశైలిపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి అందించారు. అయితే పాలకులకు ఆసక్తి లేకపోవడంతో నివేదికల్లో కోరిన సిఫారసులు అమలు కాలేదు. కొరగ సముదాయానికి చెందినవారికి కొంతభూమిని కేటాయించి పంటలసాగు చేయించేలా ప్రోత్సహిస్తే వారిలో మార్పు వస్తుందని ప్రధానంగా పొందుపరిచారు. అడవుల్లో దొరికే వస్తువులతోపాటు శివారులోని గ్రామాలకు వెళ్లి భోజనం కోసం ఆశ్రయించే దయనీయస్థితిలో ఉండేవారు. ప్రస్తుతం వారికి అవసరమైన ఆహారాన్ని పంటలసాగు, బుట్టల అల్లిక, వెదురు ఉత్పత్తుల తయారీ ద్వారా వచ్చే సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు.

చేతివృత్తుల వైపు మళ్లించే యత్నం

కొరగ కులస్థులు పంటల సాగుకు అనేకమైన ఇబ్బందులు ఉన్నాయి. వారు నివసించే అటవీప్రాంతంలో ఐదారు నెలలపాటు నిరంతర వర్షాలు, తర్వాత రెండు నెలలు విపరీతమైన చలి ఉంటుంది. ఒకేచోట ఎకరం, రెండెకరాల భూమి కూడా అందుబాటులో ఉండదు. అందుకే చేతివృత్తుల వైపు మళ్లించే ప్రయత్నాలు జరగాలని పీర్ కమిటీ సూచించింది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో హాళాడిలో ఇది విజయవంతమైంది. అందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడం సాధ్యం కాకపోకపోవచ్చు కానీ చేతివృత్తుల వంటి పనులలో చైతన్యం తీసుకురావాలని పీర్ కమిటీ సూచించింది. సంప్రదాయకంగా వారు రైతులు కూడా కాదు కాబట్టి అందుబాటులో ఉండే భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూనే సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం, సమగ్ర గ్రామీణ ఆశ్రమ, ఉద్యానవన, వ్యవసాయశాఖలు సంయుక్తంగా వారు పంటల సాగు చేసేలా ప్రోత్సహించాలి. మరోవైపు మిశ్రమమైన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలి. అరటిసాగు చేస్తే మధ్యలో ఇతరత్రా పంటలు ఆకుకూరలు, కూరగాయాలు చేసేందుకు అవగాహన కల్పించాలి. పాడిపెంపకం, కోళ్లు, తేనె పెంపకం వంటి వాటిపై ఆసక్తి కల్పించేలా ప్రోత్సహించాలి. ఇప్పటివరకు 26 ఎకరాల విశాలమైన అటవీప్రాంతంలో అటవీభూమి పంటలసాగుకు అనుకూలమైంది. వారికి నీరు సమకూర్చేందుకు బోరు బావులు ఏర్పాటు చేయాలి. మూడేళ్లుగా కొరగ కులస్థులు వారికి అవసరమైన ఆహార పదార్థాలను వారే సాగు చేసుకుంటున్నారు.

తగ్గిపోతున్న కొరగలు

1981 జనాభా లెక్కల ప్రకారం కాసరగూడు, దక్షిణకన్నడ, ఉడుపితోపాటు తీరప్రాంతంలో సుమారు 22వేలమంది కొరగలు నివసించేవారు. 2001 జనాభా ప్రకారం వారి సంఖ్య 18వేలకు తగ్గింది. ప్రస్తుతం కేరళలోని కాసరగూడు జిల్లాలో 15వేలమంది, దక్షిణకన్నడలో 4,500మంది, ఉడుపి జిల్లాలో 9వేలమందితో కలిపితే సుమారు 14వేలమంది ఉన్నట్టు అశోక్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కొరగ సామాజికవర్గానికి చెందినవారిలో ఎక్కువమంది రక్తహీనత, పౌష్టికాహార లోపం, సీజనల్ వ్యాధులతో తీవ్రమైన రోగాలపాలై మృతి చెందేవారి సంఖ్య పెరగడం ఒక కారణమైతే, జీవనశైలిలో మార్పు లు రాకపోవడం, జీవనం సాగించేందుకు కష్టమై దుర్భరంగా మారి ప్రాణాలు కోల్పోయేవారు ఉన్నారని అశోక్‌కుమార్ అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా కొరగ సమాజాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన సౌలభ్యాలు పెంచాల్సిన అవసరం ఉందని అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు.



తండాలో జీవిస్తున్న కొరగ జాతి వృద్ధురాలు

పీర్ కమిటీ సిఫారసులు ఇవే..

రాష్ట్రంలో అత్యంతప్రాచీన దుర్భరమైన ఆదివాసీ తెగలలో కొరగలు కూడా ఒకరని కమిటీలో సిఫారసు చేశారు. కొరగ సముదాయానికి సామాజిక, ఆర్థిక, విద్యపరిస్థితులపై మహ్మద్‌పీర్ కమిటీ ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

- సామాజికంగా వారు మార్పు చెందాలంటే కనీసం బాల్యంలో ఉండేవారికి విద్య అందించాలి.
- కొరగ సామాజికవర్గానికి ప్రత్యేకంగా ఓ సహకార సంఘం ఏర్పాటు చేయాలని. ప్రతి కొరగ కుటుంబానికి రెండున్నర ఎకరాల భూమిని కేటాయించాలి.
- వ్యవసాయ రంగానికి అవసరమైన సౌలభ్యాలను ప్రభుత్వమే కల్పించాలి. కొరగ కుటుంబాలు అక్కడే జీవనం సాగించేలా సౌలభ్యాలు కల్పించాలి.
- పంటలసాగులో వారికి పూర్తివిశ్వాసం కల్పించాలి. సొంతంగా ఆలోచించడం, పంటలసాగు ఏ విధంగా చేయాలనేది అవగాహన కల్పించాలి. సుస్థిరమైన అభివృద్ధిని రూపొందించాలి. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి.
- మహ్మద్‌పీర్ కమిటీలో అర్థశాస్త్ర ప్రొఫెసర్ గిరియప్ప, కొరగ సమాజం నుంచి ఇంజనీరింగ్ పట్టభద్రుడైన మోహన్, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ సభ్యులు ఉన్నారు. దక్షిణకన్నడ జిల్లా పంచాయతీ కమిటీని ఏర్పాటు చేసింది. 1993-94లో మహ్మద్‌పీర్ కమిటీ 13 సిఫారసులను సూచించింది. అయితే కమిటీ నివేదిక సమర్పించి మూడు దశాబ్దాలు పూర్తి అయినా సమగ్రంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. అధికారులు, పాలకులు ప్రసంగాల్లో కొరగ సామాజికవర్గం పట్ల చూపిస్తున్న అభిమానం ఆచరణలో విఫలమయ్యారు.

కేరళ తరహా అభివృద్ధికి డిమాండ్

కేరళ రాష్ట్రంలో సుమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో కొరగ సామాజికవర్గానికి చెందినవారికి శిక్షణలు ఇచ్చి పంటల సాగులో భాగస్వామ్యులను చేసి వారిలో ఆత్మాభిమానం పెంచారు. భూమి మంజూరు చేసిన తర్వాత వారు అక్కడే ఉండేలా ఆశ్రయం కల్పించారు. పంటల సాగు చేసే చోటునే ఇల్లు లేదంటే వారు మరోప్రాంతానికి వలస వెళ్లేందుకు లేదా అటవీప్రాంతాలకు వెళ్లేందుకు ఆలోచిస్తారు. ఇల్లు ఉంటే అక్కడే గడుపుతారనేది అక్కడి నిర్ణయంగా ఉంది. నిరంతరంగా పొలంలో తిరుగుతుండడం వల్ల పంటలసాగుపై వారికి ఆసక్తి పెరుగుతుందనేది కేరళలో అధ్యయనం చేసిన నిపుణులు ప్రభుత్వానికి సూచించగా అమలు చేస్తున్నారు.

కొరవడిన చైతన్యం

సాధారణంగా భూమి మంజూరు చేస్తేనే ముగిసిందని అధికారులు భావించారు. కానీ పీర్‌కమిటీ కొరగ సామాజికవర్గానికి భూమి కేటాయంచడంతోపాటు వారిని పంటలసాగు చేసేంతవరకు చైతన్యం కల్పించాలని సూచించింది. షెడ్యూల్డ్ ట్రైబ్స్‌లో ఒక శాతం ఉండే కొరగ కులస్థుల ప్రగతికి పలు అడ్డంకులు ఉన్నాయి. ఇప్పటివరకు ఉడుపి జిల్లాలో కొరగ కులస్థులకు రెండున్నర ఎకరాలకు బదులు కేవలం ఎకరా భూమి మాత్రమే లభించింది. కొరగ సమాజం 7-8శాతం కుటుంబీకులకు ఎకరా భూమి మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది.



వెదురు ఉత్పత్తుల తయారీ

200 మంది పట్టభద్రులు ఉన్నారు..

కొరగ సమాజానికి చెందిన ప్రముఖులు, సమగ్ర గ్రామీణ ఆశ్రమ ప్రస్తుత అధ్యక్షుడు అశోక్‌కుమార్ అభిప్రాయం ప్రకారం దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో సుమారు 14వేలమంది కొరగ సమాజంవారు నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బుట్టల అల్లిక పనులు చేస్తారు. వెదురు ఉండడంతో బుట్టలతోపాటు పలు వస్తువులు తయారు చేస్తారు. ఇప్పటివరకు 200మంది డిగ్రీలు పూర్తి చేశారు. ఐదుమంది డాక్టరేట్ పొందినట్లు అశోక్‌కుమార్ తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సబితా సోషియాలజీలో 2022లో మంగళూరు యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. ఆదివాసీల అభివృద్ధికి పాలసీలు అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు పీహెచ్‌డీ అందుకున్నారు. ఉడుపి జిల్లా గుడ్మి గ్రామానికి చెందిన సబితా కొరగ సామాజిక నుంచి పీహెచ్‌డీ అందుకున్న తొలి మహిళగా గుర్తింపు పొందడంపై హర్షం చేస్తున్నారు.



పీహెచ్‌డీ పొందిన సబితా

కమలంలో కలకలం..!

- బీజేపీలో భిన్నస్వరాలు తారస్థాయికి
- విజయేంద్రపై పోటీకి రెబెల్స్ నుంచి కసరత్తు
- ప్రధాన కార్యదర్శి హోదాకు సునీల్‌కుమార్ రాజీనామా..? ● రంగంలోకి సంతోష్



కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో భిన్నస్వరాలు తారస్థాయికి చేరాయి. పార్టీ పదాధికారుల సంస్థాగత ఎన్నికలు జరిపేందుకు అధిష్ఠానం నిర్ణయించడంతోపాటు ఇన్‌చార్జ్‌గా కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను నియమించిన తర్వాత గ్రూపు విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మరోసారి తానే కొనసాగుతానని ప్రకటించారు. దీనిపై వ్యతిరేక కూటమి తీవ్రంగా స్పందించింది. రెబెల్స్ గ్రూప్ నుంచి రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేయించేందుకు సిద్ధమయ్యారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని బీజేపీకి అత్యంత బలంతోపాటు ప్రజాప్రతినిధులు ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం రెబెల్స్ కూటమిలో ఉండే కీలకనేతలు బసనగౌడపాటిల్ యత్నాళ్, రమేశ్‌జార్కిహొళి తదితరులు అటువైపువారే కావడంతో ఎన్నికల్లోనూ పోటీ పెరిగి రాష్ట్రమంతటా పార్టీ వర్గాల్లో రెండు గ్రూపులుగా విడిపోతే పార్టీకి పెను ప్రమాదమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రూపులను ఐక్యం చేసే విషయంలో ఇటు రాష్ట్ర అగ్రనేతలు అటు పార్టీ అధిష్ఠానం పెద్దలు సకాలంలో స్పందించకపోవడం విమర్శలకు కారణమవుతోంది. పార్టీ అధ్యక్షుడు విజయేంద్రతో కలసి పనిచేసే ప్రసక్తే లేదని రెబెల్ నేత రమేశ్‌జార్కిహొళి అభిప్రాయపడ్డారు. యడియూరప్ప పట్ల కూడా అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. అందుకు దీటుగా స్పందించిన విజయేంద్ర నిన్నకాక మొన్నవచ్చినవారు ఇష్టారాజ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. అందుకు రమేశ్ జార్కిహొళి కూడా తీవ్రంగానే స్పందించారు. 'నేను పార్టీలోకి వచ్చినందుకే మీ తండ్రి యడియూరప్ప ముఖ్యమంత్రి అయ్యారనేది మరువరాదన్నారు'. రమేశ్ జార్కిహొళి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ యడియూరప్ప సీనియర్ నేత అని ఆయన పట్ల నోటి కొచ్చినట్టు మాట్లాడడం మంచిదికాదన్నారు. ఇలా సాగుతుండగానే పార్టీలో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి.

సునీల్‌కుమార్ రాజీనామా

పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీలో క్రమశిక్షణ, క్రియాశీలకంగా వ్యవహరించే సునిల్‌కుమార్ తనను పార్టీ పదవినుంచి విముక్తి చేయాలని అధిష్ఠానాన్ని కోరడం సర్వత్రా చర్చకు కారణమవుతోంది. పార్టీ ఎన్నికల విషయమై రాష్ట్ర నాయకులతో చర్చించేందుకు ఎన్నికల ఇన్‌చార్జ్ కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఒకరోజు పర్యటనలో పలువురు నాయకులతో చర్చలు జరిపారు. విబేధాలు కొనసాగించరాదని సూచించారు. రాష్ట్ర పార్టీలో విబేధాలు పెరుగుతరుణంలో అధిష్ఠానం తరపున పార్టీ జాతీయ నాయకుడు బీఎల్ సంతోష్ రంగప్రవేశం చేశారు. సునీల్‌కుమార్ రాజీనామాతోపాటు వివిధ అంశాలు తీవ్రం కావడంతో సంతోష్ రాష్ట్ర నాయకులతో చర్చించి అధిష్ఠానానికి నివేదిక ఇవ్వదలిచినట్టు సమాచారం.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంలో శ్రీకృష్ణ, బలరాములు

హరే రామ హరే కృష్ణ

- ఇస్కాన్‌లో ఘనంగా రథోత్సవం
- మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజాజీ నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ బలరామ రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఓవైపు వర్షం జల్లులు కురుస్తున్నా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. 40వ వార్షికోత్సవం సందర్భంగా రథోత్సవం జరిపారు. మంత్రి దినేశ్‌గుండూరావుతోపాటు పలువురు ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు. హరేరామ హరేకృష్ణ అంటూ భక్తుల నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

మహిళ దారుణ హత్య

● పాకిస్తాన్ వ్యక్తితో పెళ్లికి సిద్ధమైనందుకు కడతేర్చిన ప్రియుడు

టి. నరసీపుర కుంభమేళాకు రూ.10 కోట్లు

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్పను కోరిన మేళా కమిటీ

యోగి వేమన బోధనలు అనుసరణీయం

● జయంతి వేడుకల్లో ప్రముఖుల అభిప్రాయం

పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

వివరాలు..7లో

మా బంగారం.. మాకివ్వండి..

- ఉళ్లాల కోటెకారు బ్యాంకు ఖాతాదారుల డిమాండ్
- నేటి నుంచి మరింత గందరగోళం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరుకు అనుబంధమైన ఉళ్లాలలోని కోటెకారు వ్యవసాయ సేవా సహకార సంఘం బ్యాంకు చోరీతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ఏకంగా రూ.12కోట్ల విలువైన ఆభరణాలను దుండగులు దోపిడీ చేశారు. శుక్రవారం దోపిడీ జరిగింది. శనివారం బ్యాంకు వద్దకు కొంతమంది ఖాతాదారులు వచ్చి ఆభరణాలను విడిపించుకుంటామని డిమాండ్ చేశారు. అందుకు బ్యాంకు అధికారులు ఎటువంటి సమాధానం చెప్పలేకపోయారు. ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఎటువంటి పరిస్థితి నెలకొంటోందనని జిల్లా యంత్రాంగం, పోలీసులు, బ్యాంకు ఉద్యోగులు తర్జన భర్జన పడుతున్నారు. శనివారం ఖాతాదారులందరికీ సమాచారం ఉన్నా బ్యాంకు పరిసరాల్లో తిరగరాదని వెనుకడుగు వేశారు. సోమవారం పెద్ద ఎత్తున ఖాతాదారులు అక్కడికి చేరుకునే అవకాశం ఉంది. అవసరాలకు అప్పులు చేసినవారు కొందరైతే ఇళ్లల్లో ఎవరూ ఉండరని, భద్రతకోసం బ్యాంకులో ఆభరణాలు పెట్టి రుణాలు తీసుకుని దాదాపు పూర్తిగా చెల్లించినవారు ఎక్కువమంది ఉన్నట్లు తెలుస్తోంది. రూ.5-10వేలు బకాయి ఉంచుకుని ఆభరణాలు ఇంటికి తీసుకురాకుండా తాకట్టులో ఉంచినవారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఖాతాదారులమధ్యనే వాగ్వాదం చోటు చేసుకుని ఒకరిపై మరొకరు దాడికి దిగబడ్డారు. దోపిడీ జరిగినరోజే సీసీ కెమెరా రిపేరీ వెనుక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో, ఖాతాదారులను ఏ విధంగా నచ్చచెబుతారనేది కుతూహలం అవుతోంది.



ఉళ్లాలలోని కోటెకారు సహకార బ్యాంకు



సన్నాపురం వద్ద యంత్రంతో వరి నాట్లు వేస్తున్న రైతు

నాట్లు పద్ధతి మారింది..!

- వరినాట్లకు ఆధునిక యంత్రాలు ● సొమ్ము ఆదాతో రైతుల్లో హర్షం

కంప్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆదునిక పద్ధతులు పాటిస్తున్నారు. వరి నాట్లకు కూలీలు దొరకకపోవడంతో యంత్రాలు ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే కంప్లి తాలుకాలో జోరుగా వరినాట్లు ప్రారంభించారు. గతంలో ధర్మస్థళం గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా బీసీ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్లి తాలుకాలో నాట్లు ప్రారంభించారు. సుమారు కంప్లి తాలుకాలో 35,215 హెక్టార్ల భూముల్లో వరినాట్లు వేస్తున్నారు. మిగతా భూముల్లో జొన్న మిరప, ప్రొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తున్నారు. జలాశయం నుంచి ఒక్కసారిగా ఉప కాలువలకు నీరు విడుదల చేయడంతో రైతులు నాట్లు వేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వరినాట్లు నాటేందుకు ఎకరాకు కూలీలకు రూ. 4 వేలు వరకు కూలీ ఇవ్వాల్సి వస్తోంది. అయితే చిన్నపాటి రైతులు కూలీలకు ఇచ్చేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. యంత్రాల ద్వారా గంటకు ఏడు ఎకరాలలో నాట్లు వేస్తున్నారు. దీనికి గంటకు రూ.రెండు వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. యంత్రంతో సొమ్ము, సమయం ఆదా అవుతోందని రైతులు పేర్కొంటున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.32	1,588.90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.686	0
నీటి నిల్వ (టీఎంసీలు)	65.11	10.14

ఎయిమ్స్ స్థాపనకు కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర హామీ



మాట్లాడుతున్న బీవై విజయేంద్ర

రాయచూరు జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ సంస్థను మంజూరు చేసేలా కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర హామీ ఇచాచరు. ఈ విషయంలో జిల్లా ప్రజలు విద్యావంతుల అభిష్టాన్ని ఇప్పటికే బీజేపీ గుర్తించిందని ఈ విషయం పై కేంద్ర ప్రభుత్వానికి పలు సార్లు విన్నవించిందని రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు అయ్యేంత వరకు తాము మరింత పట్టుదలతో శ్రమిస్తానన్నారు. మాజీ మంత్రి కే శివనగౌడ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని మాన్వి పట్టణంలో సామూహిక వివాహాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీవై విజయేంద్ర తాను అనుకున్నది సాధించే వరకు విశ్రమించేది లేదని పెద్దలు తన పై నమ్మకంతో ఉంచిన పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను వారి అభిష్టం మేరకు నిర్వహిస్తునే పార్టీని తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేందుకు శక్తివంచనలేకుండా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం మార్పుకు సంబంధించి తనకేమి సమాచారం లేదని ఈ విషయం మాట్లాడిన రమేశ్ జారకిహోళి, బసనగౌడ యత్నాళ్‌లకు అంత మంచే జరగాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా మాజీ మంత్రి శివనగౌడ నాయక్ ఎలాంటి అధికారం లేకపోయినా ఇలాంటి సామాజిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమని ఇది ఇతరులకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి కే శివనగౌడ నాయక్, సామూహిక వివాహాల నిర్వహణ అయినా సామాజిక కార్యక్రమం ఏది చేపట్టినా తమ అంతిమ లక్ష్యం జిల్లాకు ఎయిమ్స్ సంస్థను రాబట్టుకోవడమేనన్నారు. ఈ విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీవై విజయేంద్ర మరింత గట్టిగా కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ జాతీయ నాయకత్వానికి జిల్లా ప్రజల సమస్యను వివరించి జిల్లాకు ఎయిమ్స్ లభించేలా కృషి చేయాలని కోరారు. కాగా సామూహిక వివాహాల సందర్భంగా 120 జంటలకు ఏకకాలంలో పెళ్లిళ్లు జరిపించి నూతన వధు-వరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్తీకల్లు స్వాధీనం

రాయచూరు జనవరి 19(ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం తెలంగాణ వైపు నుంచి కల్తీకల్లును అక్రమంగా రవాణా చేసి వ్యాపారం సాగిస్తున్న నిందితులను ఆదివారం ఎక్సైజ్ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ రైల్వే స్టేషన్ నుంచి నగరంలోని రైల్వే స్టేషన్‌కు పెద్ద ఎత్తున కల్తీకల్లును రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి దాడి చేసి, 250కిపైగా లీటర్ల కల్తీకల్లును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

● ఐజీపీ బీఎస్ లోకేష్‌కుమార్ పిలుపు ● ఉత్సాహంగా మారథాన్ ● పరుగులు తీసిన ఎస్పీ తదితరులు



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఐజీపీ లోకేష్, ఎస్పీ శోభారాణి



మారథాన్‌లో ఐజీపీ, ఎస్పీ, డీసీ తదితరులు

బళ్లారి సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసాలపై యువతతో పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బళ్లారి జోనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీఎస్. లోకేష్ కుమార్ పిలుపునిచ్చారు. సైబర్ సేఫ్టీ, మహిళలు, పిల్లల భద్రత , రోడ్డు భద్రత, డ్రగ్స్ రహిత కర్ణాటకపై అవగాహన కల్పించేందుకు ఆదివారం అనంతపురం రోడ్డులోని జిల్లా నూతన పాలనా భవనం ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మారథాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.
ఇటీవల సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని, విద్యావంతులు సైతం మోసాలకు గురవుతున్నారన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. తెలియని ఫోన్ కాల్స్‌కు స్పందించరాదని, ఓటీపీల పట్ల జాగ్రత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు.
జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు వాడే యువతతోపాటు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురి కాకుండా మీతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ.. సైబర్ సేఫ్టీ, మహిళలు, పిల్లల భద్రత, రోడ్డు భద్రత, డ్రగ్స్‌పై ప్రజలు అవగాహన కల్పించేందుకు ఈ ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో రోడ్డు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తానని ప్రతిజ్ఞ చేయడానికి ఆన్‌లైన్ యాప్ క్యూర్ ఆర్ కోడ్ విడుదల చేశారు. నగరంలోని కొత్త జిల్లా పాలనా భవన్ ఆవరణ నుంచి ప్రారంభమైన ప్రజా చైతన్య రన్ గడిగి చెన్నప్ప సర్కిల్, పాత తాలూకా ఆఫీసు రోడ్డు, హెచ్‌ఆర్ గవియప్ప (మోతి సర్కిల్), వాల్మీకి సర్కిల్, పాత బస్టాండు మీదుగా తిరిగి కనకదుర్గమ్మ ఆలయం వరకు సాగింది. కొత్త జిల్లా పరిపాలన భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక పై పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, ఏఎస్పీ నవీన్‌కుమార్, విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.రుద్రేశ్, ఇతర అధికారులు, క్రీడాకారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కస్టమర్లకు బ్యాంకులు సహకరించాలి



జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్ తదితరులు

బళ్లారి సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు కేవలం వ్యాపార దృక్పథంతో లాభాలే లక్ష్యంగా పెట్టుకోకుండా కస్టమర్లతో ఫ్రెండ్లీగా ఉండాలని బళ్లారి జిల్లా పారిశ్రామిక వేత్తల సంఘం మాజీ అధ్యక్షుడు వి.రవికుమార్ అన్నారు. నగరంలోని కాళమ్మ రోడ్డులో నంచి పార్వతీనగర్ మెయిన్‌రోడ్డు భవనానికి మారిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంతకు ముందు బ్రాంచ్ ఉన్న భవనంలో సీనియర్ సిటీజన్లు మెట్లు ఎక్కడం కష్టంగా ఉండేదని, దీన్ని మార్చాలని బ్యాంకు ఉన్నతాధికారులకు విన్నవించగా అన్ని వసతులతో కూడిన భవనానికి తరలించడం శుభపరిణామమన్నారు. ఈసందర్భంగా బ్యాంకు సీనియర్ అధికారి హుబ్లీ జోన్ మేనేజర్ సుచేత్ డిసోజా, బ్రాంచ్ మేనేజర్ దివాకరరెడ్డి, న్యాయవాది ప్రకాష్, యశంతరాజ్, రమణప్ప భజంత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం పదాధికారుల నియామకం



నూతనంగా ఎన్నికైన రైతు సంఘం నేతలు

కంప్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని కణివి తిమ్మలాపురం గ్రామంలో కర్ణాటక రైతు సంఘం హసురు సేన (జె కార్తీక్ సంఘం) తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప నేతృత్వంలో నూతనంగా పదాధికారుల నియామకం చేపట్టారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్ రామయ్య, అధ్యక్షుడిగా హనుమేష్, ఉపాధ్యక్షుడిగా ఎన్ రాఘవేంద్ర, ఎన్ నాగప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి దేవేంద్ర, సంచాలకులుగా సుధాకర్, జగదీష్, మహదేవప్ప, మంజునాథ, తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల ఆత్మహత్యలు జరుగుతున్న కుటుంబాలను ఆదుకోవాలి, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. వరిధాన్యం ఖరీదు కేంద్రంను ఖరీఫ్, రబీలో ఏపీఎంసీలలో ఏర్పాటు చేయాలి, రసాయనిక ఎరువులు, క్రిమికీటక మందుల ధరలు తగ్గించాలని కోరారు.

విజయవంతంగా ఉద్యోగ మేళా

తోరణగల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకాలోని శ్రీశైలం విద్యా కేంద్రంలో సంతోష్‌లాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ, ఇన్సురెన్స్, టయోటా, హ్యాపీ మైండ్, సొల్యూషన్, నవ భారత్ ఫర్టిలైజర్ ఈజీ వెంచర్, జస్ట్ డయల్ విశ్వమై సొల్యూషన్ తదితర కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. దాదాపు నాలుగు వేల మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సంతోష్ లాడ్ మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి చేయడానికి ఈ సంస్థను ప్రారంభించడం జరిగిందని అలాగే యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ఎంపీ తుకారామ్ మాట్లాడుతూ సంతోష్ లాడ్ ఫౌండేషన్ చేసిన అభివృద్ధి పనులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తుకారామ్, ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్, సండూరు విరక్తిమఠ ప్రభుస్వామిజీ, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ఎల్ స్వామి, పురసభ అధ్యక్షులు సిరాజ్, సండూరు పురసభ ఉపాధ్యక్షురాలు లత, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

వేమన బాటలో నడిచి.. ఆదర్శంగా నిలవాలి

● బళ్లారిలో రెడ్డి కల్యాణ భవన నిర్మాణానికి చేతులు కలపాలి
● వేమన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నారా

బళ్లారి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యోగి వేమన చూపిన మార్గంలో నడుస్తూ.. సమాజంలో మంచి చేస్తూ గుర్తింపు పొందాలని, అప్పుడే యోగి వేమన కన్న కలలు నిజం చేసిన వారు అవుతామని బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వం తరుపున జిల్లా పాలనా యంత్రాంగం, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర పాలికె సంయుక్తంగా జరిగిన యోగివేమన జయంతి నగరంలోని జోళదరాశి దొడ్డన గౌడ కళామందిలో నిర్వహించారు. ముందుగా రెడ్ల సంఘం నాయకులు నగరంలో గోవిందప్ప కళ్యాణ మంటపం నుంచి రెడ్డి హస్టల్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. నగర ప్రధాన రహదారి మీదుగా యోగివేమన చిత్రపటాన్ని ట్రాక్టర్ పై ఉంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోళదరాసి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన సభకు రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు నారా ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి హస్టల్ భవన నిర్మాణం, కల్యాణ మంటపం నిర్మాణానికి రూ. 50 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, కానీ అందరి సహకారంతో నిర్మిస్తేనే బాగుంటుందని అన్నారు. రాజకీయాల్లో వేర్వేరు పార్టీల్లో ఉన్నా సంఘం అభివృద్ధిలో అందరూ సహకరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి హస్టల్ నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు. జిల్లా రెడ్ల సంఘం అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులం అంటే త్యాగాలు, దానధర్మాలకు పెట్టిన పేరు. అలాగే యోగి వేమన చూపిన మంచి మార్గంలో అందరూ నడిచి సమాజానికి మంచి చేస్తామన్నారు. వీరితో పాటు రెడ్డి మహిళ సంఘం నాయకురాలు, శైలజారెడ్డి, పూలచర్ల విజయలక్ష్మి(విజ్జి), యశోద, రత్నమ్మ, శకుంతల,శారద, లీలా, పరిమళ, మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర కీలకం అన్నారు. ప్రతి మహిళ సమాజ అభివృద్ధితో పాటు సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వక్తలు, కవి మస్తాన్ వేమన పద్యాలు వినిపించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరితో పాటు కార్యదర్శి తిమ్మారెడ్డి, హేమచంద్రారెడ్డి, డాక్టర్ బసారెడ్డి, రాకెట్ల క్రిష్ణారెడ్డి, ప్రభురెడ్డి, కేశవరెడ్డి, అనిల్‌రెడ్డి, యల్లారెడ్డి, మల్లారెడ్డి, ఐనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్పలో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప : యోగి వేమన పద్యాలు నేటికీ మరువరానివని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. సిరుగుప్ప పట్టణం బళ్లారి రోడ్డు మార్గంలో వుండే రెడ్డి సముదాయ భవనంలో 613వ యోగివేమన జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు, యోగి వేమన, వేమారెడ్డి మల్లమ్మ భావచిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ ముత్తయ్య, రెడ్డి సంఘం అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రముఖులు బీజీ మంజునాథరెడ్డి, మారుతీ వరప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంప్లిలో..



కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో.

కంప్లి: మహాయోగి వేమన తత్వాలను అందరూ అలవరుచుకోవాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. వేమన జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో భావ చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేపట్టి జయంతి నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షులు బసలింగప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, ఇటిగి బసవరాజు గౌడ, రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్, చంద్రకాంత్ రెడ్డి, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మురళి, లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.

రాయచూరులో..



మాట్లాడుతున్న తహసీల్దార్ సురేశ్ వర్మ

రాయచూరు : మహాయోగి వేమన తత్వ సిద్ధాంతాలను పాటించాలని రాయచూరు తహసీల్దార్ సురేశ్ వర్మా పిలుప్నునిచ్చారు. ఆదివారం స్థానిక పండిత్ సిద్ధరామ్ జంబదిన్ని రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతాక శాఖల సంయుక్తాధ్వర్యంలో మహాయోగి వేమన జయంతిని ఆచరించారు.మహాయోగి వేమన తత్వసిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఆయన సిద్ధంతాలు పేదప్రజల వృద్ధికి నాంది అవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



నేతాజీకి నివాళి అర్పిస్తున్న ఎఐడీఎస్ఓ సభ్యులు

బళ్లారి సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏఐడీఎస్ఓ జిల్లా సమితి ఆధ్వర్యంలో నేతాజీ సుబాస్ చంద్రబోస్ 128వ జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్య-సంస్కృతి, పొదుపు-మానవాళి, అనే జిల్లాస్థాయి పోటీలను శ్రీ మేధా గ్రాడ్యుయేట్ కళాశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్, కంపోజ్డ్ పోయెట్రీ, గానం, ప్రసంగం, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్‌ఇండియా ఎడ్యుకేషన్ సేవ్ కమిటీ చైర్మన్ సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ... విద్యార్థుల్లో ఉన్నత నైతికత-సంస్కృతి పెంపొందిచాల్సిన అవసరం ఉందని, ఈ బాధ్యత అందరిపై ఉందన్నారు. లక్షలాది మంది భారతీయుల పక్షాన నిలబడి, స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధంగా ఉన్నాను సత్యానికి ఏదైన ప్రాముఖ్యత ఉంటే దేశ ప్రజలు ఏదో ఒక రోజు నా మనుసులోని భావాలను అర్థం చేసుకుంటారు. స్వాతంత్య్ర పోరాట జ్వాలలో తన రక్తాన్ని త్యాగం చేసిన వీరుడే నేతాజీ సుబాస్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారన్నారు. సాంస్కృతికంగా నైతికంగా రోజురోజుకు దిగజారుతున్న ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో నేతాజీ ,భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, ఖుదీరామ్ బోస్ వంటి స్వాతంత్య్ర పోరాట యోధుల అత్యున్నతన్నత ఆలోచనలు, ఆదర్శాలు, విలువలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న, ఉపాధ్యాక్షురాలు ఎం.శాంతి, అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వరుస సెలవులతో ట్రాఫిక్



నడిరోడ్డుపై ఆగిపోయిన వాహనాలు

హోసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వారాంతంతోపాటు సంక్రాంతికి వరుస సెలవుల నేపథ్యంలో నగరంలో ఆదివారం ట్రాఫిక్‌రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగకు వరుస సెలవులు వచ్చాయి. పొరుగున ఉంటున్న కర్ణాటక రాష్ట్రంలో నివసిస్తున్న తమిళులు తమ స్వస్థలాలకు వెళ్ళగా, మరికొందరు వాపసు వెనుతిరిగారు. దీంతో ఇరువైపులా కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరాయి. అదే విధంగా ఆదివారం కార్మికులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, సామాన్య ప్రజలు తమ నివాస ప్రాంతాలకు తిరిగి రావడంతో కర్ణాటక రాష్ట్రం అత్తిబెలె, హోసూరు సమీపాన జూజూవాడీ చెక్‌పోస్టు ప్రాంతంలో తీవ్ర ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఉచిత కంటి చికిత్స శిబిరం



శిబిరంలో నిర్వాహకులు, వైద్యబృందం

హోసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు రాయకోట రోడ్డుల్లోని ఆర్‌వి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో రోటరీ క్లబ్, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 36వ ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ ఆనందయ్య ప్రారంభించారు. శిబిరంలో 344 మందికి పరీక్షలు చేశారు. రోటరీ నిర్వాహకులు అసిస్టెంట్ పన్నీర్ సెల్వం, రోటరీ క్లబ్ గవర్నర్ వాసుదేవన్, మధు చైర్మెన్లు వెంకటచలపతి, చైర్మెన్ రవి, కోశాధికారి చంద్రశేఖర్, అధ్యక్షుడు జోగరాజ్, కార్యదర్శి రాకేశ్, కోశాధికారి హరికృష్ణ పాల్గొన్నారు. శిబిరంలో శస్త్రచికిత్సకు 101 మందిని ఎంపిక చేశారు. ప్రస్తుతం 88 మందిని ఉచిత బస్సుల్లో తీసుకెళ్లారు, మిగతా 13 మందిని స్వయంగా వారే వెళ్లారు. మెడికల్ ఎగ్జిక్యూటివ్ మూర్తి ఆనందకుమార్ బేటరాయస్వామి, సెల్వకుమార్, రాజలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరీ ఆలయ కుంభాభిషేకం

హోసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని ధన్వంత్రీ భగవాన్ ఆలయం మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఉత్సవంలో అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై, కృష్ణగిరి ఎంపీ గోపినాథ్ సహ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ధన్వంతరికి నూతన ఆలయాన్ని నిర్మించారు. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆవరణలోని ఆలయానికి నూతన రాజగోపురం, విమాన కలశాలను ప్రతిష్టించారు. 14న యాగశాల పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మహాకుంభాభిషేకం జరిగింది. గణపతి హోమం, నవగ్రహ హోమంతో పాటు వివిధ షోమాలు జరిగాయి. ఆదివారం ఉదయం పవిత్ర జలంతో కూడిన కలశాలకు పూజలతో ప్రారంభం చేశారు. సంప్రదాయం ప్రకారం పవిత్ర జలంతో విమాన గోపురం, రాజ గోపురంపై కళశాలకు అభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమం జరిగింది. అన్నాడీఎంకే రాజ్యసభ సభ్యుడు తంబిదురై, మాజీ మంత్రి కేసి వీరమణి, కృష్ణగిరి జిల్లా ఎంపీ గోపినాథ్, ఎన్‌టీఆర్ రైతు సంఘం, నిర్వాహకులు ముని వెంకటప్ప, అమ్రీష్, అరుణ్‌రాజన్ పాల్గొన్నారు.



కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

హోసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మాభిమానానికి ప్రతీకగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని హోసూరు కార్పొరేషన్‌లోని కమ్మభవనం బుక్కసాగరం, దొమ్మసంద్రం సహా పలు చోట్ల ఎన్టీఆర్‌కు పుష్పాంజలి ఘటించారు. హోసూరు కామరాజ నగర్ కాలనీలో కమ్మ సంఘంవారి తరపున ఎన్టీఆర్ అభిమానులు కూడా పాల్గొన్నారు. కమ్మం సంఘ అధ్యక్షుడు దేవతార్ కమ్మగోపాల్ నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మారసంద్రం ఫోర్స్ యజమాని రామస్వామి, పంచాయతీ మాజీ అధ్యక్షుడు శూలగిరి యూనియన్ కౌన్సిలర్ చంద్రశేఖర్, లోకేశ్, శ్రీరామ్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. హోసూరు తాలూకా బుక్కసాగరం గ్రామంలో ఎన్టీఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో కూడా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునుస్వామి, యశ్వంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.




ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న కమ్మసంఘం నాయకులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బందా కనకలింగేశ్వరరావు (జయంతి)



రంగస్థల, సినిమా నటుడు బందా కనకలింగేశ్వరరావు 1907 జనవరి 20న కృష్ణా జిల్లా ఆటపాకలో జన్మించారు. నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడిగా రాణించడమే కాక న్యాయవాదిగాను ప్రతిభ చాటారు. తర్వాత 1938లో ఏలూరులో నాటక కళాశాలను స్థాపించి పలువురికి శిక్షణ ఇచ్చారు. ప్రభాత్ థియేటర్ సంస్థ ద్వారా నాటకాలలో నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టారు. తొలితరం సినిమాలైన బాలనాగమ్మ, పాదుకా పట్టాభిషేకం తదితర సినిమాలలో నటించారు. రాష్ట్రపతి అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. 1968 డిసెంబరు 3న కన్నుమూశారు.

విఠలాచార్య (జయంతి)



'జానపద బ్రహ్మ'గా పేరొందిన బీ విఠలాచార్య 1920 జనవరి 20న కర్ణాటక రాష్ట్రం ఉడుపిలో జన్మించారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాలకు దర్శకత్వంతోపాటు నిర్మాతగానూ వ్యవహరించారు. అప్పటి పరిమితమైన సాంకేతిక పరిజ్ఞానంతో అపారమైన ప్రతిభను చాటారు. తక్కువ ఖర్చుతో కనులకు ఇంపైన కళాఖండాలను రూపొందించారు. 1954లో విఠల్ ప్రొడక్షన్స్ ఏర్పాటు చేసి 'కన్యాదానం' సినిమాను రూపొందించారు. ఎన్టీఆర్, కాంతారావులకు మాస్ ఫాలోయింగ్ తెచ్చింది ఆయన సినిమాలే. ఎంతో దక్షత, బాధ్యతగల నిర్మాత. 1999 మే 28న కన్నుమూశారు.

కృష్ణంరాజు (జయంతి)



తెలుగు వెండితెరపై 'రెబెల్ స్టార్'గా పేరొందిన ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు 1940 జనవరి 20న పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో జన్మించారు. గోపీకృష్ణ మూవీస్ అధినేత. 183 సినిమాలలో నటించారు. ఉత్తమ నటుడిగా నంది అవార్డులతోపాటు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. కెరీర్ ప్రారంభంలో పాత్రికేయుడిగా పనిచేశారు. రాజకీయాల్లో రాణించారు. 1998లో కాకినాడ నుంచి లోక్‌సభకు ఎన్నికై వివిధ శాఖలకు కేంద్రమంత్రిగా వ్యవహరించారు. 2022 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

రోబోటెక్ చికిత్సల్లో కావేరి రికార్డు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోబోటెక్ శస్త్రచికిత్సలలో కావేరి ఆసుపత్రి తక్కువ వ్యవధిలోనే 500 బెంచ్ మార్క్‌ను పూర్తి చేసిందని ఈడీ డాక్టర్ ఎస్ విజయ్‌భాస్కరన్ తెలిపారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. అన్ని ఆపరేషన్లు విజయవంతం అయ్యాయన్నారు. వీటిలో కీళ్ల అమరికకు మ్యాకో రోబోటెక్‌ను పరిచయం చేశామన్నారు. 1200 కన్సల్టేషన్‌లపైకి అవసరమైన 50మందికి ఆపరేషన్లు చేయడం ద్వారా ఒక మైలురాయిని సాధించామన్నారు. రోబోటిక్ ఆపరేషన్లతో తక్కువనొప్పి, వేగవంతంగా కోలుకునేందుకు వీలుంటుందన్నారు. దీర్ఘకాలంలో సమస్యలు ఉండవన్నారు.

మండ్లిపల్లిలో భారీ చోరీ

25 తులాల బంగారం అపహరణ



తనకల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని మండ్లిపల్లిలో భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించిన ఎస్ఐ గోపి ఆదివారం తెలిపిన మేరకు.. మండ్లిపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి ఈనెల 16న రాత్రి కుటుంబ సభ్యులతో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లారు. 18వతేదీ రాత్రి పొద్దుపోయిన తరువాత ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగలకొట్టిఉండడంతో లోపలికెళ్లి పరిశీలించారు. ఇంటిలో ఉన్న బీరువాలను పగులకొట్టి దొంగలు తమ కుమారులు, కోడళ్ల బీరువాల్లో దాచుకున్న 25 తులాల బంగారం, 26 తులాల వెండి, రూ. 3 లక్షల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయమే అనంతపురం నుంచి పోలీసు జాగిలాలను రప్పించి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ కూడా వచ్చి చోరీ జరిగిన ఇంటిలోని వస్తువులు, బీరువాలు, మంచాలను, క్షుణంగా పరిశీలించింది. కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ గోపి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మల్లికార్జునరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమాచారం ఇవ్వండి: సీఐ

ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. విలువైన బంగారం, వెండి, నగదు ఇళ్లలో ఉంచుకోకూడదని, బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఇళ్లవద్ద అవసరమైతే సీసీ కేమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ఇళ్లవారిని అప్రమత్తం చేయాలన్నారు.

మర్తాడులో...

గార్లదిన్నె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి తులం బంగారం, 11 తులాలు వెండి అభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మర్తాడులో హాజిబాషా, షకీలా దంపతులు గ్రామంలో కూలీ పనులతో జీవనం సాగించేవారు. అనంతపురంలో షకీల తమ్ముడి నిశ్చితార్థం ఉండడంతో ఈనెల 11న వెళ్లారు. ఆదివారం తిరిగి మర్తాడుకు వచ్చారు. ఇంటి తాళం పగలకొట్టి బీరువాలోని 11 తులాల వెండి అభరణాలు, తులం బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా, జమేదార్ గురుమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యోగి వేమన బోధనలు అనుసరణీయం

దొమ్మసంద్ర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్యాగమూర్తి, వచనకారుడు యోగి వేమన బోధించిన వచనాలు నేటికీ అనుసరణీయమని పురసభ అధ్యక్షుడు శారద వరదరాజు అభిప్రాయపడ్డారు. చందాపుర పురసభలో వేమన జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఆదివారం పుష్పాంజలి ఘటించారు. పద్యాలు, వచనాలతో ప్రజలను చైతన్యం చేసిన మహాయోగి పుంగవుడన్నారు. కార్యక్రమంలో పురసభ ఉపాధ్యక్షురాలు మంజుళ, సభ్యులు నారాయణస్వామి, బనహళ్ళి సోమణ్ణ, మునితిమ్మారెడ్డి, స్థానిక ప్రముఖులు, పురసభ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో...

బొమ్మనహళ్ళి: నియోజకవర్గంలోని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో మహాయోగి వేమన 613వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాయోగి క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కూల్‌జాయింట్ సర్కిల్‌లోని ఆదివారం యోగివేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం సభ్యుడు, కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడు కే వాసుదేవరెడ్డి మాట్లాడుతూ మహాయోగి వేమన రచించిన పద్యాలు నేటికీ ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. ప్రతి పద్యం ఒక చక్కటి అర్థంతో ప్రజలను చైతన్యం తెచ్చేలా ఉందన్నారు. యోగి వేమన పద్యాలు జాతీయంగా ప్రాచుర్యం పొందాయని కవిగానే మహాజ్ఞాని అని కొనియాడారు. ప్రతి ఏటా వేమన జయంతి ఉత్సవం హెచ్ఎస్ఆర్ లే అవుట్, కోరమంగల ప్రాంతాల్లో ఘనంగా ఆచరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కుపేంద్రరెడ్డి, హెచ్ఎస్ఆర్ లే అవుట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వాసు, తదితరులు పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలలో కూడా అభిమానులు, ప్రజలు యోగివేమనకు నివాళులు అర్పించారు.



హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో వేమన జయంతిలో ప్రముఖులు



చందాపుర పురసభలో వేమన జయంతి

హుణసేనహళ్లి అధ్యక్షుడిగా మురళి



మురళితో గ్రామపంచాతీ సభ్యులు తదితరులు

శిడ్లఘట్ట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్ష స్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో జీఎన్ మురళి విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి జగదీశ్ ప్రకటించారు. అధ్యక్షస్థానానికి కేఎం రవి కుమార్, జీఎన్ మురళిలు నామినేషన్ దాఖలు చేయగా రవికుమార్‌కు 8 ఓట్లు, మురళికి 9 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు ఆధిక్యంతో మురళి అధ్యక్షుడిగా గెలుపొందారని ప్రకటించారు. ఫలితాల అనంతరం మురళి మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడతానని, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. కాగా 17మంది సభ్యులలో జేడీఎస్ మద్దతుదారులు 9మంది, కాంగ్రెస్ మద్దతుదారులు 8మంది ఉన్నారు. ఓటింగ్‌వేళ జేడీఎస్ మద్దతదారుడైన రాజప్ప తన ఓటును కాంగ్రెస్ మద్దతుదారుడైన మురళికి వేయడంతో గేమ్‌చేంజర్‌గా మారింది. ఇంతవరకు జేడీఎస్‌లో ఉన్న అధ్యక్షస్థానం కాంగ్రెస్ పాలైంది. ఈ నేపథ్యంలో కొందరు సభ్యులు రాజప్ప తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తల మధ్య నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో పట్టణ పోలీసులు బందోబస్తు ఉండడంతో వివాదాన్ని నియంత్రించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని సభ్యులను సత్కరించారు. గ్రామపంచాయతీ సభ్యులు, ప్రముఖులు శ్రీనివాస్ రామయ్య, సుబ్రమణి, బసవరాజు, మునియప్ప, క్యాతప్ప, సంతోష్, మునిరాజ్, రాజకుమార్, బాలకృష్ణ, నాగనరసింహ, సాదిక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

బంగారపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత పాటించడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని ఇందుకు ప్రజలంతా సహకరించాలని డీకే హళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని డీకే హళ్ళి పంచాయతి పరిధిలో భారత్‌నగర్ మార్గంలో వెలవ్ ఫౌండేషన్, ఏఎస్ఈ జడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వచ్ఛతా అభియానను ప్రాంభించి మాట్లాడారు. మన చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వచ్ఛతపై యువతలోనూ, ప్రజల్లోనూ చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టడంపై అభినందించారు. కార్యక్రమంలో గ్రామపంచాతీ సభ్యుడు బాబు, ప్రముఖులు మునిరాజు, కరుణామూర్తి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా అభియానలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు సురేశ్ తదితరులు

మిల్లెట్ మేళాను విజయవంతం చేయండి



మిల్లెట్ రన్‌కు పచ్చజెండా

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సిరిధాన్యాలు ఆరోగ్యానికి వరంలాంటివని అందరూ ఆహారంగా వినియోగించాలని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి పిలుపునిచ్చారు. మిల్లెట్ మేళా 2025ను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కబ్బన్‌పార్క్‌లో వాకథాన్ నిర్వహించారు. ఈనెల 23 నుంచి మూడు రోజులపాటు ప్యాలెస్‌మైదానంలోని త్రిపుర వాసినిలో అంతర్జాతీయ వాణిజ్యమేళా, సిరిధాన్యాలు, సేంద్రియ సాగు విజయవంతం కోసం మిల్లెట్‌రన్ జరిపారు. వ్యవసాయ శాఖ కమిషనర్ వైఎస్ పాటిల్, క్రికెటర్‌లు భరత్ చిప్లి, నటి అర్చనా జోయిస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ మహదేవపుర గ్రామీణ అధ్యక్షుడిగా హూడి పిళ్లప్ప

మహదేవపుర, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ బీజేపీ అధ్యక్షుడిగా ఏకలవ్య పురస్కార గ్రహీత హూడి పిళ్ళప్పను మాజీ మంత్రి, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ ముఖ్యులు అరవింద లింబావళి ఎంపిక చేశారు. కాటంనల్లూరులోని కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో పిళ్ళప్పను ఎంపిక చేస్తూ ప్రకటించారు. ఎమ్మెల్యే మంజులా లింబావళి, బెంగళూరు కేంద్ర జిల్లా ఉప ఎన్నికల అధికారి మంజునాథ్ మల్లతహళ్ళి పార్టీ జెండాను అందచేశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ మంత్రి లింబావళి సూచించారు. అనంతరం హూడి పిళ్ళప్ప మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. పార్టీ నాయకుల మార్గదర్శకంలో ముందుకు సాగుతానన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేలా పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా బీఎస్ నటరాజ్, ముఖ్యులు పాపణ్ణ, బిదరహళ్ళి రాజేశ్, కణ్ణూరు అశోక్, మంజునాథ్, కేవీ నాగరాజ్, హూడి వార్డు అధ్యక్షుడు పవన్‌రెడ్డి, యువ విభాగం ప్రముఖులు పవన్‌శెట్టి, వెంకటేశ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విజయ్‌గౌడ, శక్తికేంద్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న హూడి పిళ్లప్ప

నగరమంతటా జడివాన

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తీవ్రమైన చలి కొనసాగుతుండగా ఆదివారం తెల్లవారుజామునుంచి జడివాన పట్టుకుంది. చలితోపాటు జడివాన కారణంగా నగర ప్రజలు గడగడ వణికారు. నగరంలో వారాంతమంటే ప్రత్యేకమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జనం ఉత్సాహం చూపుతారు. లాల్‌బాగ్‌లో ఫ్లవర్‌షో, కబ్బన్‌పార్కులో మిల్లెట్‌రన్, ఇస్కాన్‌లో రథోత్సవం వర్షంలోనే కొనసాగాయి. సెలవు రోజు కావడంతో ప్రజలు అత్యధికశాతం ఇంటిపట్టునే గడిపారు. నగరంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఇలాంటి పరిస్థితి నెలకొంది. మరోరెండు మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. తీరప్రాంత జిల్లాల్లో ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురవగా మలెనాడు ప్రాంతాల్లో వర్షం నిరంతరంగా కొనసాగింది.



వర్షం కారణంగా అరకొరగా వాహన సంచారం...

టి. నరసీపుర కుంభమేళాకు రూ.10 కోట్లు అవసరం

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా టి నరసీపురలోని త్రివేణిసంగమంలో జరిగే కుంభమేళాకు రూ.10కోట్లు అవసరమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్పను మేళా కమిటీ కోరింది. ఫిబ్రవరి 10నుంచి మూడురోజులపాటు కుంభమేళా జరపనున్నట్టు తెలిపారు. 1989లో కుంభమేళా ప్రారంభించారని అప్పటినుంచి ప్రతి మూడేళ్లకోసారి కుంభమేళా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆదివారం మైసూరులోని జలదర్శిని గెస్ట్ హౌస్‌లో సన్నాహకసభ జరిగింది. 2020-21లో మేళా జరగాల్సి ఉన్నా కొవిడ్ కారణంగా నిర్వహించలేదన్నారు. కుంభమేళాలో స్వచ్ఛత కాపాడాలని మంత్రి మహదేవప్ప తాలూకా కమిటీకి సూచించారు. మూడు రోజుల కుంభమేళాలో సాంస్కృతిక, జానపద, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఇతర ప్రాంతాలనుంచి వచ్చేవారికి సౌలభ్యాలు కల్పించాలని తీర్మానించారు. జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ ఐదు ప్రదేశాలలో స్నానపుఘట్టాల ఏర్పాటుకు గుర్తించామని, ఒక యాగశాల, ఆరు కుటీరాలు కల్పించదలిచామన్నారు. ఎమ్మెల్సీ యతీంద్రసిద్ధరామయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐపై చర్యలు తీసుకోండి

- కొడుకుపై దాడి చేశాడని మహిళ ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తనను రెండో పెళ్లి చేసుకున్న ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తన కొడుకుపై చేయిచేసుకున్నాడని ఓ మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం రాత్రి అంజలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. 14వ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తనను రెండో పెళ్లి చేసుకున్నాడని, కొంతకాలంగా దూరం పెడుతున్నాడని తెలిపింది. విజయవాడలో చదువుతున్న కొడుకు స్కూల్ ఫీజు కడతానని చెప్పి సాయంత్రం ఇంటికి పిలిపించుకున్నాడని, అక్కడికి వెళితే మరో వ్యక్తితో కలిసి దాడి చేశారని ఆరోపించింది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వివరణ కోరగా... ఆమె ఏఆర్ ఎస్ఐ తన కొడుకుపై దాడి చేశారని చెప్పారని, కానీ ఫిర్యాదు ఇవ్వడం లేదన్నారు. శాశ్వత పరిష్కారం కావాలని కోరుతున్నారని వివరించారు.



పోలీసుస్టేషన్‌లో బాధిత మహిళ, ఆమె కుమారుడు

కామిక్‌కాన్‌లో చిన్నారుల సందడి

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైట్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ కేటీపీఓ ట్రేడ్‌సెంటర్‌లో నిర్వహించిన కామిక్‌కాన్‌లో చిన్నారులు సందడి చేశారు. తమకు ఇష్టమైన స్పైడర్‌మాన్ సహా పలు రూపాలలో యువత, చిన్నారులను పలకరించడంతో పాటు సెల్ఫీలుతో ఉత్సాహంగా గడిపారు. నోడ్విన్ గేమింగ్ కోఫౌండర్ అక్షత్‌రథీ మాట్లాడుతూ బెంగళూరులో 12వ విడత కామిక్ కాన్‌కు అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. యువత ప్రపంచస్థాయి అనుభవాలు పొందేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. నగరం యానిమేషన్, పాప్ సంస్కృతి పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. గేమింగ్ అరెనా వ్యవస్థ ఉందన్నారు. మారుతి సుజుకి, యమహా రేసింగ్, క్రంచిరోల్, రేడియో మిర్చి, వార్నర్ బ్రదర్స్ వంటి ప్రత్యేక జోన్‌లలో గేమ్‌లలో పాల్గొన్నారు. నెర్డ్ అరెనా, రెడ్ వుల్ఫ్, బాంకర్స్ కార్నర్ ప్రజాధరణ పొందిన బ్రాండ్‌లు పాల్గొనడం ద్వారా కామిక్స్, బొమ్మలు, డిజైన్‌లు, పరికరాలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు. రెండురోజుల పాటు సాగిన కార్నివాల్‌లో వేలాది మంది యువత భాగస్వాములయ్యారు.



కామిక్‌కాన్ ఉత్సవ్‌లో యువత సందడి

పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

చింతామణి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వసతి పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉంటూ నిధులు దుర్వినియోగం ఆరోపణలపై సస్పెండ్‌కు గురయ్యారు. వివరాలిలా. గడిగవారహళ్ళిలోగల మొరార్జీదేశాయ్ వసతి పాఠశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన వేళ నిధుల దుర్వినియోగానికిగాను ఎఆర్ ఖుబ్రా ముబీన్‌ను సస్పెండ్ చేస్తూ కార్యనిర్వాహక డైరెక్టర్ పీఎస్ కాంతరాజు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం శిడ్లఘట్ట తాలూకా గొర్లగుమ్మనహళ్ళిలోని మొరార్జీ దేశాయ్ వసతి వసతి పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న ఖుబ్రాముబిన్ అంతకుముందు గడిగవార హళ్ళిలోని మొరార్జీదేశాయ్ వసతి పాఠశాల, కే రాగుట్టహళ్ళి కిత్తూరు రాణి చన్నమ్మ వసతి పాఠశాలలోనూ విధులు నిర్వహించారు. ఆమెపై పలు ఫిర్యాదులు రావడంతో తనిఖీల వేళ రికార్డులను అప్పగించకుండా పాఠశాల పాలకవర్గాన్ని ఇబ్బందిపెట్టినట్టు గుర్తించారు. అంతేకాకుండా ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయిన 20 రోజుల తర్వాత కూడా తాలూకాలోని గడిగవారహళ్ళి మొరార్జీదేశాయ్ వసతి పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ జాయింట్ అకౌంట్‌లో ఉన్న మొత్తాన్ని రూ.1,56,406 మొత్తాన్ని చెక్కురూపంలో అక్రమంగా తీసుకున్నారు. బదిలీ అయిన తర్వాత నిధులను అక్రమంగా డ్రా చేయడంపై ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉంటూ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన వారు ఇలా దారి తప్పేలా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

విజయపుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సమస్య తలెత్తినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొంటేనే జీవితంలో విజయం సాధ్యమని కర్ణాటక భూకబ్జా నిషేధ ప్రత్యేక కోర్టు సభ్యుడు ఎస్ఎస్ పాటిల్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర సమీపంలోని గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ ఏడో వార్షికోత్సవం సంభ్రమ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చెప్పినట్టుగా యువతే దేశానికి గొప్ప శక్తి అన్నారు. రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం యువత శ్రమించాలన్నారు. పాఠశాల అధ్యక్షుడు పి సురేశ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ భావిపౌరులను తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమన్నారు. అలాగే విద్యార్థుల ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథులను, ప్రముఖులను ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ఎడ్యుకేషన్ ట్రస్టు కోశాధికారి హేమావతి సురేశ్, ట్రస్టీలు రామచంద్రారెడ్డి, మంజణ్ణ, వేణుగోపాల్, ఆర్ మదన్‌కుమార్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అతిథులకు సన్మానం

మహిళ దారుణ హత్య

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ యువకుడితో పెళ్లికి సిద్ధమైన ప్రియురాలిని ప్రియుడే చంపేశాడు. ఆత్మహత్యగా చిత్రీకరించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుట్రను పోలీసులు ఛేదించారు. నిందితుడు ఇందాద్ బాషా (53)ను బెంగళూరులోని హెచ్ఏఎల్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని హెచ్‌బీఆర్ లే అవుట్ నివాసి ఉజ్మాఖాన్(45), సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇందాద్ బాషా (53) సమీప బంధువులు. ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఇందాద్ బాషా... భార్యతో విభేదాలు రావడంతో వదిలిపెట్టి 2017లో బెంగళూరుకు వచ్చాడు. ఇదే సందర్భంలోనే భర్తను వదిలిపెట్టిన ఉజ్మాఖాన్‌తో సంబంధం ఏర్పడింది. ఆరంభంలో థణిసంద్రలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేకంగా ఫ్లాట్‌ను తీసుకుని, ఇద్దరు నివసించేవారు. పదినెలల తర్వాత ఇందాద్ మళ్లీ ముంబై వెళ్లాల్సి రావడంతో అతడికి ఉండే రెండు ఫ్లాట్లను ఖాళీ చేసి, వెళ్లిపోయాడు. ఉజ్మాఖాన్ హెచ్‌బీఆర్ లేఅవుట్‌లోని తల్లి ఇంటికి చేరింది. కొంతకాలం తర్వాత ఇందాద్ మళ్లీ బెంగళూరుకు వచ్చి కుందలహళ్ళి దీపం నివాస్ అపార్ట్‌మెంట్‌లో ఉండేవాడు. అప్పుడప్పుడు ఉజ్మాఖాన్ ఇంటికి వచ్చి వెళ్లేవాడు. 2024లో ఉజ్మాకు మరో పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఆస్ట్రియా దేశంలో నివసిస్తున్న పాకిస్తాన్ వ్యక్తి అర్షద్‌తో పెళ్లికి చర్చలు సాగించారు. ఇందుకు ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. ఉజ్మా మొబైల్‌ను క్లోన్ చేసుకున్న ఇందాద్‌కు అన్ని విషయాలు తెలిశాయి. ఎంతోకాలంగా సన్నిహితంగా ఉండే ఉజ్మాఖాన్ దూరమవుతుండడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఇందాద్ డిసెంబరు 31న స్వయంగా వంట చేసిన ఫొటోలను షేర్ చేసి, ఇంటికి ఆహ్వానించాడు. రాత్రి 9.30 గంటలకు ఉజ్మా నేరుగా ఇందాద్ ఇంటికి వచ్చింది. భోజనంలో విషం కలిపి ఉజ్మా ను హత్య చేశాడు. తర్వాత మరుగుదొడ్లు శుభ్రం చేసే హార్పిక్‌ను కొంత సేవించి కాసేపటికి ఉజ్మా సోదరికి మెసేజ్ ద్వారా ఇద్దరం ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించిన సోదరి బంధువులు, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చింది. కాసేపటికి అక్కడికి బంధువులు చేరుకోగా.. ఇద్దరూ అస్వస్థతకు లోనై పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఉజ్మాఖాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇందాద్‌కు చికిత్సలు అందించారు. ఉజ్మా మృతి చెందిన 10 గంటల తర్వాత ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. పైగా ఆమె నేరుగా ఎటువంటి విషం తీసుకోలేదని భోజనంలోనే కలిపినట్లు స్పష్టమైంది. ఇందాద్ కోలుకున్నాక అదుపులోకి తీసుకుని విచారించగా... హత్య చేసినట్లు అంగీకరించారని వైట్‌ఫీల్డ్ డీసీపీ డాక్టర్ శివకుమార్ గుణారె శనివారం మీడియాకు తెలిపారు.